సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

## ముఖ్యమంత్రిని కలిసిన ఉపాధ్యాయులు

కాశీబుగ్గ, జూన్ 23: తెలంగాణ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో ఆదివారం కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. 8,630 మంది భాషాపండితులకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే, పలు ఉపాధ్యాయ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, కమిషనర్ దేవసేన, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి జీ తిరుమల, కాంతికృష్ణ, కోశాధికారి వి.ఎస్.ఎస్.శర్మ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు హమీద్‌ఖాన్ బృందం పాల్గొన్నారు.

## జిల్లాలో మోస్తరు వర్షం

ఖిలావరంగల్, జూన్ 23: జిల్లాలో శనివారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు మోస్తరు వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా 21.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. అత్యధికంగా వరంగల్ మండలంలో 45.4 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా నెక్కొండలో 8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే, ఆదివారం సాయంత్రం ఖిలావరంగల్ మండలంలో 39.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, వరంగల్, నెక్కొండ, గీసుగొండ, చెన్నారావుపేట, ఖానాపురం, దుగ్గొండి, నల్లబెల్లి, పర్వతగిరి మండలాల్లో తేలికపాటి జల్లులు కురిసినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

## బీటెక్ విద్యార్థి అదృశ్యం

అక్షయ్ (ఫైల్)

కాశీబుగ్గ, జూన్ 23: బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న భూపాలపల్లి జిల్లా చెల్పూరు గ్రామానికి చెందిన మద్దె వేణి అక్షయ్ ములుగురోడ్డు సమీపంలో అదృశ్యమైనట్లు తండ్రి రవీందర్ మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్షయ్ జయముఖి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఫీజు కోసం తండ్రి అతడికి రూ. 5100 ఇవ్వగా, రూ. 3900 కట్టి మిగితా డబ్బులు సొంతానికి వాడుకోవడంతో తండ్రి మందలించాడు. దీంతో శుక్రవారం బస్సులో వచ్చి ములుగు రోడ్డు జంక్షన్‌లో దిగాడు. కాలేజీకి వెళ్లకపోవడంతో స్నేహితులు, బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మట్టెవాడ పోలీసులు తెలిపారు.

## ఆగస్టు 26 నుంచి పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు

ఖిలావరంగల్, జూన్ 23: ఖిలావరంగల్ రోడ్డు శక్తి స్థల్‌లోని శ్రీశివశక్తి వినాయక మందిరంలో దేవతామూర్తుల పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలను ఆగస్టు 26 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీతోపాటు మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్‌యాదవ్, శంభునిగుడి మాజీ చైర్మన్ గజ్జెల శ్యామ్ ఆదివారం కరత్రాలు ఆవిష్కరించారు. ఈ వేడుకల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఎమ్మెల్యే దొంతికి సన్మానం

నర్సంపేట రూరల్, జూన్ 23: నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం నాయకులు ఘనంగా సన్మానించారు. దొంతి ఇటీవల అమెరికా, కెనడా పర్యటనకు వెళ్లి తిరిగొచ్చిన సందర్భంగా ఆదివారం ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు, గుంటూరుపల్లి మాజీ సర్పంచ్ కర్నాటి పార్వతమ్మ ఆధ్వర్యంలో పలువురు మహిళా నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మహిళా నాయకులు రమ, శ్రీదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ క్రీడాకారుడికి శుభాకాంక్షలు

కాశీబుగ్గ, జూన్ 23: ప్రపంచ చాంపియన్‌షిప్, భారత బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిదంబి శ్రీకాంత్ ఆదివారం భద్రకాళి దేవస్థానానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టెవాడ సీఐ తుమ్మ గోపి అతడిని కలిసి పూల మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## రేపటి నుంచి మరమ్మతులు

సంగెం, జూన్ 23: మండలంలోని ఎల్గూర్‌రంగంపేట ఆర్‌యుబీని రేపటి నుంచి మూసివేయనున్నట్లు రైల్వే అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు ఆర్‌యుబీలో మరమ్మతులు చేయనున్నట్లు పేర్కొన్నారు. వాహనదారులు, ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని కోరారు. ఎల్గూర్‌రంగంపేట గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రైల్వే అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## గాంధీనగర్‌లో నగలు అపహరణ

నల్లబెల్లి, జూన్ 23: నగలు అపహరణకు గురైన ఘటన మండలంలోని గాంధీనగర్‌లో జరిగింది. గుండ్లపహాడ్ పరిధిలోని గాంధీనగర్‌కు చెందిన పెంతల రాజు శనివారం ఇంటికి తాళం వేసి, తాళం చెవిని దూగిటిలో పెట్టి భార్య లావణ్యతో కలిసి పొలం పనులకు వెళ్లాడు. గుర్తుతెలియని వ్యక్తులు తాళం చెవితో తాళం తీసి ఇంట్లోకి ప్రవేశించి 15 గ్రాముల నెక్లెస్, 8 గ్రాముల చైన్, 7.5 గ్రాముల రెండు ఉంగరాలు, 2.5 గ్రాముల జతకమ్మలు, 1.05 గ్రాముల చిన్న జతకమ్మలు కలిపి మొత్తం 37 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించారు. వీటి విలువ రూ. 1.85 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం సాయిలు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
SepTeK
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-318953

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557

# పదహారే కదా అని వదిలేస్తే..

- పింఛన్ల పంపిణీలో గోల్‌మాల్
- రాయపర్తి మండలంలో నెలకు రూ.1,34,736 వెనకేసుకుంటున్న పోస్టల్ సిబ్బంది
- అడిగే ధైర్యం చేయని లబ్ధిదారులు

రాయపర్తిలో పింఛన్ కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

పోస్టాఫీస్‌లో పంపిణీకి సిద్ధంగా ఉన్న నగదు, నాణేలు

రాయపర్తి, జూన్ 23: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఆసరా (చేయూత) పింఛన్ల పంపిణీ వ్యవస్థను పూర్తిగా గాలికొదిలేసింది. దీంతో మండలంలోని పోస్టల్ ఉద్యోగులు ఆర్థిక వనరుగా మార్చుకున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. రూ. 2,016, రూ.4,016 పింఛన్ల పంపిణీలో రూ.16ను సిబ్బంది వెనకేసుకుంటున్నారని చర్చించుకుంటున్నారు. ప్రశ్నిస్తే ఎక్కడ పింఛన్ నిలిపేస్తారోననే భయంతో కాలం వెళ్లదీస్తున్నట్లు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని సబ్ పోస్టాఫీస్ పరిధిలో మండలంలో 17 గ్రామీణ తపాలా కార్యాలయాలు పనిచేస్తున్నాయి. 39 గ్రామాల పరిధిలో 8,296 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారు నెలనెలా రూ. 1.70కోట్ల పింఛన్ డబ్బులు పొందుతున్నారు. ఈ క్రమంలో పోస్టల్ సిబ్బంది పైనున్న రూ. 16ను ఎగవేస్తుండడంతో ప్రతి నెలా పోస్టల్ సిబ్బంది జేబులోకి రూ. 1,34,736 చేరుతున్నది.

### ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు

గ్రామీణ తంతి-తపాలా కార్యాలయాల్లో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు చేస్తున్న ఓవర్ యాక్షన్‌తో పింఛన్ తీసుకునేందుకు ప్రతినెలా అరిగోస పడుతున్నట్లు లబ్ధిదారులు వాపోతున్నారు. ఇష్టారాజ్యంగా పింఛన్లు పంపిణీ చేస్తున్నారని, ఉద్యోగులకు తీరిక ఉన్న సమయాల్లో వారి ఇండ్ల వద్ద పింఛన్ పంచుతుండడంతో ఎన్నో ప్రయాసాలకోర్చి వారి ఇండ్లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ పోస్టాఫీసుల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులంతా వరంగల్, హనుమకొండ నగరాలు, తొర్రూరు వంటి పట్టణాల నుంచి రాకపోకలు సాగిస్తున్నట్లు ప్రజలు చెబుతున్నారు. గ్రామా ల్లో ప్రజలకు పంపిణీ చేయాల్సిన ఎల్ఐసీ బాండ్లు, ఏటీఎం కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఉత్తరాలు, హాల్‌టికెట్లు తదితర పత్రాల పంపిణీకి గ్రామాల్లో పోస్టల్ ఉద్యోగులు ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేసుకొని పంపకాలు సాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తిర్మలాయపల్లిలో బినామీ వ్యక్తితో ఉత్తరాలు పంపిణీ చేయిస్తుండగా.. రాయపర్తిలో అసలు ఉత్తరాలు పంచే ఉద్యోగి ఎవరో తెలియక ఇబ్బందులకు గురవుతున్నామని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, చేతివాటం ప్రదర్శించిన కొండాపురం బీపీఎం నరేశ్‌కుమార్, మైలారం బీపీఎం దీపికకు మెమోలు జారీ చేయగా, సొమ్ము రికవరీకి చర్యలు చేపట్టినట్లు సమాచారం.

### చిల్లర అడిగితే చిర్రుబుర్రులాడుడే..

పింఛన్ల పంపిణీ సమయంలో పోస్టల్ ఉద్యోగులు కస్సుబుస్సులాడుతూ ఉంటున్నారు. వృద్ధాప్య పింఛన్‌దారుడనైన నాకు ప్రతి నెలా రూ. 2000 మాత్రమే చేతిలో పెడుతున్నరు. రూ. 16 చిల్లర అడిగితే చిర్రుబుర్రులాడుతూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నరు. చేసేదేమీ లేక ఇంటికి పోతున్నం. – కుంట లక్ష్మయ్య, రాయపర్తి

### సిబ్బంది పనితీరుపై నిఘా

మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న పోస్టల్ సిబ్బంది పనితీరుపై నిఘా పెంచాం. ఇటీవల మండలంలో రెండు ఘటనలు చోటుచేసుకోవడంతో పోస్టల్ డిపార్ట్‌మెంట్ కూడా అలర్ట్ అయింది. గ్రామీణ తంతి-తపాలా ఉద్యోగులపై చర్యలు తీసుకునే అధికారం మాకు లేకపోవడంతో ఏం చేయలేకపోతున్నాం. బాధితులు ఎవరైనా పోస్టల్ సిబ్బందిపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తా.
– మహ్మద్ మౌలానా, రాయపర్తి సబ్ పోస్ట్‌మాస్టర్

### పైసా దుర్వినియోగమైనా చర్యలు

చేయూత పింఛన్ల పంపిణీలో పైసా దుర్వినియోగానికి పాల్పడినా చర్యలు తీసుకుంటాం. అన్ని గ్రామాల పరిధిలోని లబ్ధిదారుల్లో ఎవరైనా తమకు అన్యాయం జరుగుతున్నట్లు ఫిర్యాదు చేస్తే వెంటనే సమగ్ర విచారణ జరిపి దోషులపై చర్యలకు డీఆర్‌డీవో, కలెక్టర్‌కు నివేదికలు అందజేస్తాం.
– గుగులోత్ కిషన్‌నాయక్, ఎంపీడీవో

కరీమాబాద్ : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చెన్నారావుపేట : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కరీమాబాద్, జూన్ 23: సుమారు 40 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులు ఒక్కచోట చేరి సందడి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉర్సులోని శ్రీవెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో 1984-85 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఉర్సు బైపాస్ రోడ్డులోని నాని గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. బలభద్ర అశోక్, కోడం శ్రీధర్, పిన్న రాజు, దేవసాని శ్రీరామ్మూర్తి, గట్ట రమణ పాల్గొన్నారు.

### పాపయ్యపేట స్కూల్‌లో..

చెన్నారావుపేట : చెన్నారావుపేట మండలం పాపయ్యపేటలోని విశ్వప్రగతి పాఠశాలలో 2006-07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 17 ఏళ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు గత అనుభవాలను గుర్తుచేసున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పత్తి అనంతరెడ్డి, ఉపాధ్యాయులు స్వామి, మంద యాకయ్య గౌడ్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఖిలా వరంగల్ : తూర్పుకోటలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

# శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళి

ఖిలా వరంగల్/నల్లబెల్లి/ఖానాపురం/గీసుగొండ/కాశీబుగ్గ, జూన్ 23 : జిల్లావ్యాప్తంగా ఆదివారం బీజేపీ నేతలు భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను నిర్వహించారు. ముఖర్జీ 71వ వర్ధంతి సందర్భంగా ఖిలావరంగల్ తూర్పుకోటలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 37వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నాంద్రె అమర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేశ్, నాయకులు గొళ్ల రాజ్‌కుమార్, బోలుగొడ్డు సతీశ్, బేర నరేందర్, నాగేందర్, రంజిత్, కిశోర్, మనోజ్ పాల్గొన్నారు. అలాగే, నల్లబెల్లిలోని బస్టాండ్ ఆవరణలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ మండల అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తడుక వినయ్‌గౌడ్, యువమోర్చా అధ్యక్షుడు సుధగాని ప్రమోద్‌గౌడ్, కడియాల విజయ్‌కుమార్, బోళ్ల నారాయణ, ఈర్ల రవి, తిరుపతి, అశోక్, రాజిరెడ్డి, యాదగిరి, నాగరాజు పాల్గొన్నారు. ఖానాపురంలో బీజేపీ ఆధ్వర్యంలో శ్యామ్‌ప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు ఆబోత్ రాజుయాదవ్, తవుటు రమేశ్, జల్లి మధు, రాజేందర్, యాకస్వామి, మల్లారెడ్డి, సతీశ్‌సాగర్ పాల్గొన్నారు. గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధం తి సందర్భంగా ఆయనకు నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి, పరకాల ఇన్‌చార్జి కాళీప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాంబాబు, సతీశ్, శిల్ప, శంకర్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, వరంగల్ పోచమ్మమైదాన్ సెంటర్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## 28న డీసీసీబీ మహాజన సభ

సుబేదారి, జూన్ 23 : ఈ నెల 28న డీసీసీబీ మహాజన సభ నిర్వహిస్తున్నట్లు బ్యాంకు సీఈవో ఎండీ వజీర్ సుల్తాన్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు పాలక మండలి సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు తప్పక హాజరు కావాలని కోరారు. సభ నక్కలగుట్టలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో జరుగుతుందన్నారు.

## గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్, జూన్ 23 : వరంగల్ మహా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి 1 గంటల వరకు గ్రీవెన్స్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజా సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. గ్రీవెన్స్‌కు సంబంధిత అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

# ఎక్కడి చెత్త అక్కడే..

- గ్రామాల్లో కొరవడిన సుందరీకరణ పనులు
- అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ
- ముందుకు సాగని తడి, పొడి చెత్త సేకరణ
- పల్లెల్లో వృద్ధి చెందుతున్న దోమలు
- చోద్యం చూస్తున్న అధికారులు

రుద్రగూడెంలో చెత్తాచెదారంతో నిండి కూరుకుపోయిన డ్రైనేజీ

నల్లబెల్లిలో అధ్వానంగా మారిన మురుగుకాల్వ

నల్లబెల్లి, జూన్ 23: గ్రామాల్లో ప్రస్తుతం పారిశుధ్య పనులు పడకేశాయి. కేసీఆర్ పాలనలో గ్రామాలు సర్వతోముఖాభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రతి గ్రామ పంచాయతీకి జనాభా ప్రాతిపదికన మల్టీపర్పస్ వర్కర్లను నియమించి గ్రామాల సుందరీకరణకు విశేషంగా కృషి చేశారు. మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో రెండు రోజులకోసారి డ్రైనేజీలను శుభ్రం చేయడం, క్లోరినేషన్ పనులు చేసి గ్రామాలను సుందరీకరించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో పారిశుధ్య పనులు చేస్తున్న పాపాన పోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారం చేపట్టిన అనతికాలంలోనే డ్రైనేజీలను శుభ్రం చేసేవారు లేక చెత్తాచెదారంతోపాటు పిచ్చి మొక్కలు పెరిగి కూరుకుపోతున్నాయి. కొన్నిచోట్ల డ్రైనేజీలు కంపు కొడుతున్నాయి. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన తీసుకొచ్చింది. గ్రామాల అభివృద్ధికి కృషి చేయాల్సిన ప్రత్యేక అధికారులు నేటికీ కనీసం ఒక్క గ్రామాన్ని సందర్శించిన దాఖలాలు లేవనే విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా నందిగామ, రుద్రగూడెం, రేలకుంట, నందిగామ, మామిండ్లవీరయ్యపల్లె, నాగరాజుపల్లె, లెంకాలపెల్లి, నారక్కపేట, మేడెపల్లి, రాంపూర్‌తోపాటు నల్లబెల్లి మండలకేంద్రంలో పారిశుధ్య పనులు చేపట్టడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా మండలకేంద్రంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కృషితో రెండు లైన్ల సీసీ రోడ్డును ఏర్పాటు చేయించారు. రహదారి విశాలంగా ఉన్నా డ్రైనేజీలు చెత్తాచెదారంతో నిండిపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మురుగుకాల్వలో నీరు నిల్చి ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. మండలకేంద్రంలో కొందరు చికెన్ సెంటర్ల నిర్వాహకులు కోళ్ల వ్యర్థాలను డ్రైనేజీల్లో వేస్తుండడంతో దుర్వాసన వస్తున్నదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ప్రజారోగ్యంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

### పారిశుధ్యంపై దృష్టి సారిస్తాం..

ప్రస్తుతం ప్రతి గ్రామంలో జీపీ సిబ్బంది మిషన్ భగీరథ సర్వేలో నిమగ్నమయ్యారు. త్వరలోనే అన్ని గ్రామాల్లో డ్రైనేజీలను శుభ్రం చేయడంతోపాటు సుందరీకరణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. మండలకేంద్రంలో రోడ్డు విస్తరణపై జిల్లా అధికారులకు నివేదిస్తాం. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటాం.
– ఎంపీవో, కూచన ప్రకాశ్, నల్లబెల్లి

## 'విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి'

సమావేశంలో మాట్లాడుతున్న సందీప్

నర్సంపేట, జూన్ 23: విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగిలిచర్ల సందీప్ డిమాండ్ చేశారు. ఆదివారం నర్సంపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని ధ్వజమెత్తారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో పుస్తకాలు, యూనిఫాం అమ్ముతున్నారని ఆరోపించారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించకుండా పాఠశాలలు నడిపిన నిర్వాహకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యా సంస్థల్లో ఫీజును నియంత్రించాలన్నారు. సమావేశంలో వర్షన్, అనిత, రాజు, రమేశ్, వెంకటేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## గుట్కా, పొగాకు ఉత్పత్తుల పట్టివేత

నెక్కొండ, జూన్ 23: మండలకేంద్రంలో రూ. 61,212 విలువైన నిషేధిత పొగాకు ఉత్పత్తులు, గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నట్లు ఎస్సై ఎం.మహేందర్ ఆదివారం తెలిపారు. మండలంలోని కిరాణా షాపులు, పాన్ షాపుల్లో తనిఖీలు నిర్వహించామని చెప్పారు. నెక్కొండలో కర్నాటి వెంకటేశ్వర్లు ఇంట్లో నిషేధిత పొగాకు ఉత్పత్తులు లభించినట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### వరంగల్ బస్టాండ్‌లో..

గిర్మాజీపేట: ప్రభుత్వ నిషేధిత రూ. 48 వేల విలువైన గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నట్లు ఇంతెజార్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. కరీంనగర్‌లో పాన్‌షాప్ నిర్వహిస్తున్న పవన్ ఆర్టీసీ కార్గో సర్వీస్‌లో మూడు కాటన్ల గుట్కా ప్యాకెట్లను వరంగల్ బస్టాండ్‌కు పంపించాడు. ఆ కాటన్ బాక్స్‌లను ఆటోడ్రైవర్ సురేశ్‌తోపాటు గౌరీశంకర్, రాజ్‌కుమార్ ఆటోలో తీసుకెళ్తుండగా ఆదివారం హెడ్‌పోస్టాఫీస్ వద్ద పోలీసులు ఆటోను ఆపి తనిఖీ చేశారు. అందులో ఉన్న కాటన్లను పరిశీలించగా గుట్కా ప్యాకెట్లు ఉన్నాయి. వాటిని సీజ్ చేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఎన్నికైన కమ్మ సేవా సంఘం కమిటీ సభ్యులు

## కమ్మ సేవా సంఘం కమిటీ ఎన్నిక

కరీమాబాద్, జూన్ 23: ట్రైసిటీ కమ్మ సేవా సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రావిపాటి వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడిగా కాపా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా గంగవరపు శ్రీరామకృష్ణప్రసాద్, రెసిడెంట్ సెక్రటరీగా యలమంచిలి వెంకటకృష్ణారావు, సహాయ కార్యదర్శిగా కొల్లి అనిల్‌కుమార్, కోశాధికారిగా బండ్ల రవీంద్రబాబు, కార్యవర్గ సభ్యులుగా ధనాల శ్రీధర్, రావిపాటి వెంకటేశ్వర్‌రావు, కుండ్ల చంద్రశేఖర్, మచ్చా చంద్రమోహన్, కంచేటి వెంకటేశ్వర్‌రావు, నల్లూరి మధుసూదన్, మార్నేని బాలశౌరిని ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కమిటీ సభ్యులకు బండ్లమూడి నాగచరణ్, బండ్లమూడి శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయ నూతన కమిటీ సభ్యులు

### ధర్మారావుపేటలో ఆలయ కమిటీ..

ఖానాపురం, జూన్ 23: ధర్మారావుపేట శివరామక్షేత్రం ఆలయ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నడిపెల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్మన్‌గా వెన్ను సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా పీ కరుణాకర్, సహాయ కార్యదర్శులుగా కూస కుమారస్వామి, బాలూనాయక్, కోశాధికారిగా ఎర్రబెల్లి వసంతరావు, ముఖ్య సలహాదారులుగా మోహన్‌రావు, వెంకట్ రెడ్డి, సంపత్‌రావు, మాన్సింగ్‌నాయక్, వెంకటేశ్వర్‌రావు, విజాకర్‌రావు, పాలకవర్గ సభ్యులుగా 34 మందిని ఎన్నుకున్నారు.

## ఇల్లు నేలమట్టం

వర్షానికి కూలిన ఇల్లు

నర్సంపేట, జూన్ 23